
సాక్షి
అనంతపురం
గురువారం । 26 । అక్టోబర్ । 2023



అతివలు.. ఆటో డ్రైవర్లు

కొందరు మహిళలు ఉపాధి కోసం ఆటోలు నడుపుతున్నారు. వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 8లో



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.9°/15.8°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలీసు పిల్లలకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో భాగంగా బుధవారం పోలీసు సిబ్బంది పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు పర్యవేక్షణలో బుధవారం 'ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అబ్యూస్ రూల్' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. జనానికి రక్ష



కల్లుమడిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం జిల్లాలోని 8 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరగగా, ఆయా ప్రాంతాల పరిధిలో 3,661 మంది ఓపీ సేవలు పొందారు. స్పెషలిస్టు వైద్యులు 277 మందిని జిల్లా, నెట్‌వర్క్, ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 473 మంది వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద సేవలు పొందారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లుమడిలో జరిగిన క్యాంపును పరిశీలించారు. రోగులకందుతున్న సేవలపై ఆరా తీశారు.


14 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలోని వేపచెర్ల, వేపలపర్తి, చెన్నంపల్లి, కణేకల్లు, బసాపురం, పెద్దయక్కలూరు, యాటకల్లు, షేక్షానపల్లి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, అనంతపురం కోర్టు రోడ్డు, శ్రీనివాస్‌నగర్, గుత్తి చెట్నేపల్లి, గుంతకల్లు భాగ్యనగర్, రాయదుర్గం రాజీవ్‌గాంధీ కాలనీ, తాడిపత్రి పాతకోట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గురువారం వైద్య శిబిరాలు జరుగుతాయని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు.

28న వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి వద్దనున్న జిల్లా జైల్లో ఈ నెల 28న వేరుశనగ చెక్క వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ రెహ్మాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాంతీయ జైళ్లశాఖ ఉప శాఖాధికారి సమక్షంలో శనివారం ఉదయం 11 గంటలకు 25వేల కిలోల వేరుశనగ చెక్క వేలం పాట జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు రూ.22వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలం ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కు చెల్లిస్తామని పేర్కొన్నారు.

అందుబాటులోకి జెడ్పీ వెబ్‌సైట్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) అధికారిక వెబ్‌సైట్ బుధవారం ప్రారంభించారు. నెలరోజులుగా దీనిపై యంత్రాంగం కసరత్తు అనంతరం అందుబాటులోకి తెచ్చారు. ఇకపై జెడ్పీలో జరిగే అన్ని కార్యకలాపాలు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. జిల్లా చరిత్ర, మ్యాప్‌లు, భౌగోళిక చరిత్ర, జెడ్పీలో ముఖ్యుల ఫోన్ నంబర్లు, జిల్లా పరిషత్ పరిధిలోని స్కూళ్లు, మండలాలు ఇలా సర్వసమాచారమూ పొందుపరిచారు. అన్నిటికంటే ముఖ్యంగా జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక యూజర్ ఐడీలు, లాగిన్ ఇచ్చారు. ఇకపై కార్యక్రమాల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాకుండా అభిప్రాయాలను పంచుకోవచ్చు. రాష్ట్రంలో గుంటూరు తర్వాత అనంతపురం జిల్లాలో మాత్రమే జిల్లా పరిషత్‌కు https://zpananthapuramu.ap.gov.in వెబ్‌సైట్ ఏర్పాటు చేశారు

పారదర్శక సేవలు : జిల్లా పరిషత్‌లో ఇకపై సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయని ఇన్‌చార్జ్ సీఈఓ, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రతి పనికీ జెడ్పీ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఆన్‌లైన్ ద్వారానే సంప్రదించవచ్చన్నారు. దీనివల్ల జెడ్పీలో జరిగే ప్రతి విషయమూ తెలుసుకునే వీలుంటుందన్నారు. త్వరలోనే ఫైళ్లన్నీ మాన్యువల్ నుంచి ఆన్‌లైన్‌కు తీసుకొస్తామన్నారు.

సామాజిక సాధికారత

- ఉమ్మడి 'అనంత'లో నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాలకూ సముచిత లబ్ధి
- ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతో మమేకం
- తాజాగా జగనన్న ఆరోగ్య సురక్షతో జనం గుండె తలుపు తట్టిన సర్కారు
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకే బస్సు యాత్ర
- నేడు శింగనమల నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర.. బుక్కరాయసముద్రంలో బహిరంగ సభ



బుక్కరాయసముద్రంలో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

సాక్షి ప్రతినిధి, అనంతపురం : 'మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందీ అంటే మళ్లీ మాకు ఓటెయ్యండి' – ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. చరిత్రలో ఇలా మేలు జరిగి ఉంటే ఓటెయ్యండని ధైర్యంగా అడిగిన ఏకైక ముఖ్యమంత్రి ఈయనే. ఈ మాటలపై రాష్ట్రవ్యాప్తంగానే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాగా చర్చ జరుగుతోంది. 'మేము మేలు చేశాం అది చెప్పడానికే మీ ముందుకు వస్తున్నాం' అంటూ సామాజిక సాధికార యాత్ర జరగబోతోంది. ఈ నెల 26వ తేదీ (గురువారం) సామాజిక సాధికార బస్సు యాత్ర శింగనమలలో ప్రారంభమై బుక్కరాయసముద్రం చేరుకుంటుంది. అక్కడ బహిరంగసభలో పలువురు మంత్రులు, నాయకులు ప్రసంగించనున్నారు. దీంతో అధికార వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం కలుగుతోంది.

అన్ని వర్గాలకూ లబ్ధి

గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటుబ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని వదిలేసిన ప్రభుత్వాలు ఎన్నో ఉన్నాయి. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వ పథకాలతో పాటు రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులూ సామాజిక వర్గాల వారీగా దక్కాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కులం, మతం, వర్గం తేడా లేకుండా అన్ని పార్టీల వారికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూర్చారు.

ఏడాదిగా జనంతోనే మమేకం

ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఇంటింటా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నికల్లో గెలవగానే ఎమ్మెల్యే ఆ ఊరు ఎక్కడుందో కూడా చూడని పరిస్థితి. కానీ భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఊర్లే కాదు ప్రతి గడపనూ తాకి వారికి కలిగిన లబ్ధిని వివరించే కార్యక్రమాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చేపట్టింది. ఏడాదిగా ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతోనే మమేకమై ఉన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రతి ఇంటినీ ఆ ఎమ్మెల్యే సందర్శించే కార్యక్రమం దాదాపు పూర్తయింది. సుమారు ఏడాది పాటు ఎమ్మెల్యేలు, కిందిస్థాయి నాయకులు ప్రజలతో మమేకం అయ్యారు. ప్రజలకు ఏం చేశామో, ఏ ఇంటికి ఎంత లబ్ధి జరిగిందో ఆధారాలతో సహా ఇవ్వగలిగారు. గ్రామ/వార్డు సచివాలయ పరిధిలోని ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించారు. అనంతపురం జిల్లాలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా చేపట్టిన పనులకు సుమారు రూ.80 కోట్లు వెచ్చించారు.



యాత్రకు సిద్ధంగా ఉన్న బస్సు

'ఆరోగ్య సురక్ష'తో చెంతకే వైద్యం

జనంతో మమేకం కావడమే కాదు 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఆయా ప్రజల గుండె తలుపు తట్టింది ఈ ప్రభుత్వం. రోగులు ఆస్పత్రులకు రావడం పాత మాట.. రోగుల వద్దకే వైద్యులు వెళ్లి ఉచిత సేవలందించిన ఘనత సర్కారు దక్కించుకుంది. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత వైద్యులే ఆ ఊళ్లకు వెళ్లి లక్షలాది మందికి వైద్య సేవలు అందించారు. నరాలు, గుండె, కంటి జబ్బులు వంటి ఎన్నో రోగాలకు పరిష్కారం లభించింది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల కింద లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	90,189	475.81
వైఎస్సార్ నేతన్న నేస్తం	10,525	83.99
వసతి దీవెన	55,888	191.88
జగనన్న విద్యా దీవెన	57,241	366.67
జగనన్న చేదోడు	14,882	40.17
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	21,539	59.54
మౌజన్, ఇమామ్‌లకు	660	34.01

(పైన పేర్కొన్నవే కాకుండా అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, పెన్షన్‌ల రూపేణా లక్షలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి జరిగింది)

సామాజిక సాధికారత.. చరిత్రాత్మకం

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన సామాజిక విప్లవం, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర చరిత్రాత్మకమైనదని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అభివర్ణించారు. సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటలకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అనంతపురం – తాడిపత్రి రహదారి పక్కన అంబేడ్కర్ సర్కిల్ దగ్గర బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే ర్యాలీగా వైఎస్సార్‌సీపీ నాయకులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు పథకాల ద్వారా అందించిన లబ్ధి, చట్టసభలు, రాజకీయ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు బస్సు యాత్ర చేపట్టారన్నారు. బహిరంగ సభకు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మంత్రులు ఉషశ్రీచరణ్, గుమ్మనూరు జయరాం, ఎంపీలు తలారి రంగయ్య, నందిగం సురేష్, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ హాజరవుతున్నారన్నారు. నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఈ-క్రాప్ సామాజిక తనిఖీ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఈ-క్రాప్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వందశాతం ఈ-క్రాప్, 98 శాతం ఈ-కేవైసీ పూర్తి చేసిన వ్యవసాయశాఖ... జాబితాలపై గురువారం నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు ఆర్‌బీకేల్లో సామాజిక తనిఖీ (సోషల్‌ఆడిట్) చేపట్టనుంది. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదుల ద్వారా పరిష్కరించనున్నారు. సామాజిక తనిఖీ తర్వాత ఈ నెల 30న తుది ముసాయిదాను ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాల సున్నావడ్డీ, ఎంఎస్‌పీ ద్వారా పంట ఉత్పత్తుల అమ్మకాలు లాంటి కార్యక్రమాలు ద్వారా రైతులకు లబ్ధిచేకూర్చడానికి ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత నెలకొంది. అందుకోసం అర్హత కలిగిన ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు 9,90,738 ఎకరాల్లో సాగైనట్లు ఈ క్రాప్‌లో నమోదు చేశారు. ఇందులో వ్యవసాయ పంటలు 6,69,568 ఎకరాలు, ఉద్యాన పంటలు 3,21,170 ఎకరాల్లో సాగైనట్లు నివేదికలో తెలిపారు. 2.72 లక్షల మంది రైతులకు గానూ 2.66 లక్షల మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నారు. మూడురోజుల పాటు జరిగే సామాజిక తనిఖీ ద్వారా రైతులందరూ తమ పంట, విస్తీర్ణం, ఇతరత్రా వివరాలు సరిచూసుకోవాలని అధికారులు తెలిపారు.

గూనిపల్లిలో భారీ కొండచిలువ



కొండ చిలువను చూపుతున్న అటవీ శాఖ అధికారులు, స్నేక్ క్యాచర్ మూర్తి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం గూనిపల్లిలో బుధవారం ఉదయం ఓ కొండ చిలువ కలకలం రేపింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 18 అడుగుల కొండ చిలువ కనిపించడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు స్నేక్ క్యాచర్ మూర్తిని వెంట బెట్టుకుని గూనిపల్లికి వచ్చారు. అతికష్ట మ్మీద కొండచిలువను బంధించి అడవిలో వదిలిపెట్టారు.

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ ఎం.గౌతమి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు

పెద్దవడుగూరు: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెద్దవడుగూరులోని టీటీడీ కల్యాణ మంటపంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండల స్థాయిలోనే అర్జీలు స్వీకరించి, పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీకి సంతృప్తికరమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ మధుసూదన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎల్‌డీఓ శంకర్ స్వీకరించారు. వివిధ సమస్యలపై దాదాపు 149 వినతులు అందాయి. పెద్దవడుగూరులోని న్యూ కాలనీకి చెందిన నీలిమా తన భర్త నరేష్ చనిపోవడంతో కుటుంబ పోషణ భారమై పిల్లలను చదివించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతమైంది. నివేశన స్థలం మంజూరు చేస్తే ఇంటి అద్దెయైనా మిగులుతుందని తెలపడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. స్పందించిన తహసీల్దార్ నాగభూషణ ఆమె అర్జీపై తక్షణ విచారణ జరిపి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. పెద్దవడుగూరులో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని క్రీడాకారులు వినతి పత్రం అందజేశారు. క్రిష్టిపాడులో బ్యాంకు ఏర్పాటు చేయాలని తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో సీసీఓ అశోక్‌కుమార్ రెడ్డి, డీపీఓ ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజరావు, సర్వే ఆఫ్ ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రూప్లా నాయక్, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీఎస్ఓ శోభారాణి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డ్వామా పీడీ వేణుగోపాల్, డీఈఓ నాగరాజు, తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024కు సంబంధించి ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ గౌతమి వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 7,057 బ్యాలెట్ యూనిట్లు, 5,462 కంట్రోల్ యూనిట్లు, 6,752 వీవీ ప్యాట్లు వచ్చాయన్నారు. వీటి తొలి విడత తనిఖీ పకడ్బందీగా సాగుతోందన్నారు. ఓట్ల తొలగింపు కోసం వచ్చిన క్లెయిమ్‌లు పరిశీలించి తొలగించారన్నారు. అలాంటి ఓట్లు తొలగింపు కాకపోయి ఉంటే పరిశీలించి ప్రొసీజర్ ప్రకారం తొలగిస్తామన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలని డీఆర్ఓ గాయత్రీదేవిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సీ పరిశీలించిన కలెక్టర్

నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఈవీఎంలు, వీవీప్యాట్‌ల తొలి విడత తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) ప్రకియను కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశీలించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉంచాలన్నారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న ఎంపీ మాధవ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

- ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం టవర్‌క్లాక్: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం జరుగుతోందని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీమ్ అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులుతో కలిసి ఎంపీ విలేకరులతో మాట్లాడారు. గురువారం శింగనమల నియోజకవర్గంలో ప్రారంభం కానున్న సామాజిక సాధికార బస్సు యాత్ర, బుక్కరాయసముద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకూ సామాజిక, ఆర్థిక న్యాయం చేకూరిందన్నారు. రాజకీయాలలో బడుగులకు అధిక ప్రాధాన్యతనిస్తూ నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. చంద్రబాబు ప్రజాధనం లూటీ చేశారు కాబట్టే జైలు జీవితం అనుభవిస్తున్నారన్నారు. తప్పుచేసిన వారు ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులను చూశామని, అయితే ఇప్పటి వరకూ ప్రజల కోసం శ్రమించింది వైఎస్ జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. కులమతాలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సమన్యాయం పాటిస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించే బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీసెల్ నాయకులు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిత్రా వెంకటేష్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికకు షెడ్యూల్ జారీ

అనంతపురం: స్కూల్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14, 17 క్రీడాకారుల ఎంపికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు అనంతపురం జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, శ్రీసత్యసాయి జిల్లా సెక్రెటరీ అంజన్న, కో ఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. అనంతపురం న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఎంపికలకు రెండు జిల్లాల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

- ఈ నెల 27న బాల్ బ్యాండ్మింటన్ అండర్-14 బాలురు, బాలికలు, జిమ్నాస్టిక్, బాక్సింగ్, మాల్‌కంబ్ ఎంపిక.
- 28న కరాటే, 30న బాల్ బ్యాండ్మింటన్, పుట్ బాల్ (అండర్-17), 31న పుట్‌బాల్ అండర్-14 బాలుర, బాలికల ఎంపిక.
- నవంబర్ 1న నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, రోప్ స్కిప్పింగ్, 2న సైక్లింగ్, తైక్వాండో, వాలీబాల్, మూడో తేదీన టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక.
- నాలుగో తేదీన సెపక్ తక్రా, రోల్ బాల్, షూటింగ్‌బాల్, ఏడో తేదీన రగ్బీ, క్రికెట్, ఎనిమదో తేదీన కబడ్డీ అండర్-14, తొమ్మిదో తేదీన కబడ్డీ అండర్-17, 19న త్రోబాల్, 13న సాఫ్ట్‌బాల్, బేస్ బాల్, స్కే మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల ఎంపికలు కుంటాయి.

శిల్పారామంలో ఖాదీ ఎగ్జిబిషన్ ప్రారంభం





ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత చలపతిరావు

అనంతపురం రూరల్: నగర శివారులోని శిల్పారామంలో ఖాదీ మహోత్సవ్- 2023 పేరిట మినీ ఎగ్జిబిషన్ కమ్ సేల్ బుధవారం ప్రారంభమైంది. చేనేత, ఖాదీ, హస్తకళల ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు చేనేత వస్త్రాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ, హస్తకళా సేవా కేంద్రం (తిరుపతి) ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవ్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శిల్పారామాల ఏఓ మునిరాజు, నేషనల్ అవార్డు గ్రహీత దళవాయి కుళ్లాయప్ప, పద్మశ్రీ అవార్డు గ్రహీత చలపతిరావు, హ్యాండీక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత, హస్తకళల ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. చేతివృత్తిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. ఇక్కడ వివిధ జిల్లాల నుంచి వచ్చిన హస్తకళలు, చేనేత, ఖాదీ ఉత్పత్తులను అమ్మకానికి ప్రదర్శిస్తామన్నారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7.30 వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుదన్నారు. కార్యక్రమంలో అనంతపురం శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి శోభాయాత్ర

దసరా ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనం బుధవారం నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను కొలువుదీర్చి నిమజ్జనానికి తరలించారు. పుర వీధుల గుండా శోభాయాత్ర వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. - సాక్షి బృందం



తాడిపత్రిలో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

అతివలు.. ఆటో డ్రైవర్లు

- బతుకు బండి నడపడంలో దిట్టలు
- నగరంలో 50 మందికి పైగా మహిళా ఆటో డ్రైవర్లు

అనంతపురం: కాలంతో పరుగులు తీస్తున్న అతివలు వారు. పోటీ ప్రపంచంలో బతికేందుకు గౌరవప్రదమైన వృత్తి ఏదో ఒకటి చాలనుకున్నారు. మగవారు సైతం రాణించడం కష్టమనుకునే ఆటోమొబైల్ రంగాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ నమ్ముకున్న వృత్తిలో మగాళ్లకు దీటుగా రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. రద్దీ రోడ్లపై ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఆటో డ్రైవింగ్‌లో రాణిస్తూ తమకు తిరుగులేదని చాటుకుంటున్నారు. అనంతపురం నగరంలో ప్రస్తుతం 50 మందికి పైగా మహిళలు ఆటోలు నడుపుతూ జీవనోపాధులను మెరుగు పరుచుకుంటున్నారు. వీరిలో చాలా మంది అద్దె ఆటోలను నడుపుతుండడం గమనార్హం. అనారోగ్యం కారణంగా కుటుంబ పెద్ద మంచాన పడితే కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్లుగా మారిన వారు కొందరైతే... అదనపు ఆదాయం కోసం పార్ట్‌టైంగా ఆటోలు నడుపుతున్న అతివలు మరికొందరు ఉన్నారు. కరోనా కారణంగా ఉద్యోగాలు పోవడంతో చదువుకున్న మహిళలు సైతం ఆటోడ్రైవర్లుగా మారి ఉపాధి పొందుతుండడం గమనార్హం. కుటుంబపోషణకు మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకం మహిళల జీవనోపాధుల మెరుగుకు మరింత దోహదపడుతోంది.

'మహిళా శక్తి'తో ఊతం

నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు 'ఉన్నతి–మహిళా శక్తి' పథకం కింద వడ్డీలేని రుణాన్ని జగన్ సర్కార్ అందజేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈ పథకం కింద తొమ్మిది మంది అర్హులను ఎంపిక చేశారు. వీరందరూ వచ్చే డిసెంబర్ 6న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆటోలు అందుకోనున్నారు. ఉన్నతి – మహిళా శక్తి పథకం కింద దరఖాస్తు చేసుకునేవారు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారై, డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం తప్పనిసరిగా కలిగి ఉండాలి. 20 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఎల్ఎల్ఆర్ కలిగి, ఆటో నడుపుతుండగా తీసిన ఓ నిమిషం నిడివిగల వీడియోతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆటో కొనుగోలు చేసేటప్పుడు 10 శాతం వాటా ధనాన్ని ముందుగా డ్వాక్రా సంఘాల ఖాతాలో జమ చేయాలి. ఉన్నతి యూనిట్ ద్వారా గతంలో తీసుకున్న అప్పుకు సంబంధించి ఎలాంటి బకాయిలూ ఉండరాదు. అవసరమైన ఆటోను లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.



ఈమె పేరు భవాని. అనంతపురం రూరల్ పరిధిలోని విద్యానగర్‌లో నివాసముంటున్నారు. భర్త అనారోగ్యంతో ఉన్నారు. కుటుంబ పోషణ భారం మొత్తం ఈమెపైనే ఉంది. దీంతో అద్దె ఆటో నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు ఆమెకు సొంత ఆటో సమకూర్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రూ.3 లక్షల వడ్డీలేని రుణం మంజూరు చేశారు. ఉన్నతి పథకం కింద మంజూరైన ఈ రుణాన్ని నాలుగేళ్ల పాటు క్రమం తప్పకుండా ప్రతి నెలా కంతుల రూపంలో చెల్లించాలి. వచ్చే డిసెంబర్ 6న సీఎం చేతుల మీదుగా ఆమె ఆటో అందుకోనున్నారు.



ఈమె పేరు సుధాపావని. పామిడి మండలం. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేది. కరోనా నేపథ్యంలో అక్కడి నుంచి స్వగ్రామానికి వచ్చేశారు. సొంత ఆటో లేక ఇంటి వద్దనే ఉంటున్న ఆమె పరిస్థితిని గమనించిన అధికారులు ఉన్నతి పథకం కింద రూ.3 లక్షల రుణం మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ఈ మొత్తంతో ఆటో కొనుగోలు చేసి, జీవనోపాధులను మెరుగుపరచుకుంటానని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత



అర్హత ఉన్న ప్రతి మహిళకూ మహిళా శక్తి పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున వడ్డీలేని రుణాన్ని అందిస్తున్నాం. నాలుగేళ్ల పాటు 48 కంతుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ మహిళా శక్తి పథకం కింద కుందుర్పి మండలంలో ఇద్దరు, బుక్కరాయసముద్రం మండలంలో ఐదుగురు, నార్పలలో 3, రాప్తాడు, పామిడి మండలాల్లో ఒకరు చొప్పున మొత్తం 12 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. – నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు

అనంతపురం క్రైం: ఇటీవల మృతి చెందిన హోంగార్డు మారెన్న కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు మృతుడి భార్య నాగమణికి ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు అందజేశారు. మారెన్న చనిపోయాక ఆయన భార్య నాగమణికి కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా హోంగార్డు సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.15 వేల సాయాన్ని అందజేశారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు : డీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

పెద్దవడుగూరు: మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించరాదని ఉపాధ్యాయులను డీఈఓ నాగరాజు హెచ్చరించారు. పెద్దవడుగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు. మెను మేరకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో వడ్డించాలని సూచించారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాముడు, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్‌లో మంగళవారం అర్ధరాత్రి కేబుల్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. తనకున్న 15 ఎకరాల్లో రైతు భార్గవ్‌రెడ్డి సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం రాత్రి కంచెను దుండగులు కత్తిరించి లోపలకు ప్రవేశించి, భూమిలో ఏర్పాటు చేసిన రూ.7 లక్షలు విలువ చేసే దాదాపు 7 వేల మీటర్ల కేబుల్ అపహరించుకెళ్లారు. ఘటనపై యజమాని భార్గవరెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిండు చూలాలికి ప్రాణం పోశారు

- జీజీహెచ్‌లో గైనిక్, అనస్తీషియా, మెడిసిన్ వైద్యుల ఘనత



కోలుకున్న నాగబిందు

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ నిండు చూలాలికి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు సకాలంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి ఊపిరి పోశారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన వెంకటేష్, నాగబిందు దంపతులు. రెండో సారి గర్భం దాల్చిన నాగబిందును కాన్పు కోసం ఈ నెల 16న ఉదయం 7.30 గంటలకు జీజీహెచ్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. ఆ సమయంలో నిండు గర్భిణి తీవ్రమైన ఆయాసంతో ఊపిరి తీసుకునేందుకు సైతం ఇబ్బంది పడుతుండడం గమనించిన గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ సుచిత్ర, డాక్టర్ పార్వతి, డాక్టర్ పూజిత తదితరులు వెనువెంటనే వైద్య పరీక్షలు నిర్వహించారు. పల్మనరీ ఎడిమా (ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం)తో బాధపడుతున్నట్లు గుర్తించి ఏఎంసీలో వెంటిలేటర్‌పై ఉంచారు. ఆ సమయంలో ఆక్సిజన్ శాతం 52, గుండె పని శాతం 30 మాత్రమే ఉంది. ఆమె పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు దృష్టికి తీసుకెళ్లి, ఆయన ఆదేశాలతో డాక్టర్ షంషాద్‌బేగం, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ భీమసేనాచార్ పర్యవేక్షణలో అడ్మిట్ అయిన రోజే ఉదయం 9.30 గంటలకు సిజేరియన్ చేసి 2.5 కిలోల బరువున్న మగబిడ్డను వెలికి తీశారు. సిజేరియన్ సమయంలో టాప్ లాక్ అనే నూతన విధానాన్ని అనస్తీషియా వైద్యులు అవలంబించారు. శస్త్రచికిత్స అనంతరం కూడా 24 గంటల పాటు నాగబిందును వెంటిలేటర్ పైనే ఉంచి వైద్యం అందించారు. అనంతరం సీ ప్యాప్ ద్వారా మూడ్రోజులపాటు ఆక్సిజన్ అందించారు. ఈ నెల 21న బాలింత ఆరోగ్య పరిస్థితి మెరుగు పడడంతో లేబర్ వార్డులోని హై డిపెండెన్సీ యూనిట్(ఐసీయూ)కు తరలించారు. ప్రస్తుతం బాలింత నాగబిందు, ఆమె బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. తల్లీబిడ్డకు ప్రాణం పోసిన గైనిక్, మెడిసిన్, అనస్తీషియా, చిన్నపిల్లల విభాగం వైద్యులను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అభినందించారు. సాధారణంగా ఈ తరహా కేసులకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.లక్షల్లో వసూలు చేస్తారని, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా అందించే ఈ చికిత్సపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

జాతీయస్థాయిలో 'అనంత'కు 3వ స్థానం

- తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో



తల్లిపాల శ్రేష్టత గురించి మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం అర్బన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు –2023 నిర్వహణలో దేశంలో అనంతపురం జిల్లాకు మూడోవ స్థానం లభించింది. ఈ మేరకు బుధవారం బీపీఎన్ఐ (బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా) నుంచి ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందిందని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. కలెక్టర్ గౌతమి నేతృత్వంలో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించడం – ఒక వైవిధ్యాన్ని చూపడం' అనే అంశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తల్లిపాల శ్రేష్టత, విశిష్టత తెలియజేసేందుకు ఉమ్మడి గృహ సందర్శనలు, ఆస్పత్రులు, కార్యాలయ సందర్శనలు, అవగాహన సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, పోటీల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను బీపీఎన్ఐకు అందించామన్నారు. సమగ్ర పరిశీలన తరువాత ఫలితాలు ప్రకటించారన్నారు.

జిల్లాకు గర్వకారణం

తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు సంబంధించి జాతీయస్థాయిలో మూడో స్థానం రావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓలు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో నిర్వహించడంతోనే ఈ గుర్తింపు వచ్చిందన్నారు. తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 2,302 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు లబ్ధి చేకూరుతోందన్నారు. అందుకు ఫలితంగా ఈ రోజున జాతీయస్థాయిలో జిల్లా మూడో స్థానంలో నిలిచిందన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

పెనుకొండ రూరల్: వయసు మీరిపోతున్నా.. పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన వడ్డే హరీష్ (28)కు పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు కొన్నేళ్లుగా సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏ ఒక్కటీ కుదరలేదు. ఈ క్రమంలోనే తన స్నేహితులకు పెళ్లిళ్లు జరిగిపోతుండడంతో మనోవేదనకు లోనైన హరీష్.. మంగళవారం రాత్రి మొక్కజొన్న తోటకు కాపలా వెళ్లి అక్కడే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

- ఇద్దరి పట్టివేత... పరారీలో పలువురు
- పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం
- 19 ద్విచక్ర వాహనాల సీజ్



పట్టుబడ్డ నిందితులు, వాహనాలు చూపుతున్న ఎస్ఐ యువరాజ్

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి పరసర ప్రాంతాల్లో గుట్టచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సిబ్బందితో కలసి ఎస్ఐ యువరాజ్ బుధవారం దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన నిందితులు పెద్ద సంఖ్యలో అక్కడి నుంచి పరారు కాగా, ఇద్దరు మాత్రమే పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో బచ్చేహళ్లి నివాసి బాబు, కన్నెపల్లి గ్రామానికి చెందిన నరసింహ ఉన్నారు. రూ.88,500 నగదు స్వాధీనం చేసుకుని, 19 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పరారీలో ఉన్న జూదరుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

అనంతపురం క్రైం: కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బోయ సురేష్ (45) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. 2009 బ్యాచ్‌కు చెందిన సురేష్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం గోళ్ల (కళ్యాణదుర్గం మండలం)కు తరలించారు. అంత్యక్రియలను గురువారం నిర్వహించనున్నట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు



బస్సును కారు ఢీకొట్టిన దృశ్యం

రాయదుర్గం టౌన్: పట్టణ శివారులోని మల్లాపురం సమీపంలో బుధవారం రాత్రి 7.30 గంటలకు ఆర్టీసీ బస్సు, కారు పరస్పరం ఢీకొన్నాయి. బస్సులోని దాదాపు 50 మంది ప్రయాణికులు క్షేమంగా బయపడ్డారు. ఇద్దరు మహిళా ప్రయాణికులు రత్నమ్మ, శ్యామల మూగదెబ్బలతో ఆస్పత్రిలో చేరారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడి అక్కడి నుంచి పారిపోయారు. మద్యం మత్తులో ఉన్న యువకులు కారులో ప్రయాణిస్తూ కుంటుమారెమ్మగుడి వద్దకు చేరుకోగానే ఎదురుగా చదం గ్రామం నుంచి రాయదుర్గానికి వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డీఎం సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

అనంతపురం, కల్చరల్ : రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నాటకోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు సీనియర్ కళాకారుడు, కార్యక్రమ నిర్వాహకుడు మైఖేల్ బాబు బుధవారం వెల్లడించారు. 26న అరవకూరు, 28న కొత్తపల్లి, 29న కాట్నేకాలువ, 30న చిన్మయనగర్‌లోని కళాకారుల కాలనీలో పంచరత్నాలు నాటికలను ప్రదర్శించనున్నాట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాల ప్రచారంతో పాటు పౌరాణిక ఘట్టాలను ప్రదర్శిస్తారన్నారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు శివ

పెద్దపప్పూరు: మద్యానికి బానిసైన తండ్రి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చాగల్లుకు చెందిన నారాయణ స్వామికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అనంతపురంలోని ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శివ (19) ఇంటి పట్టునే ఉంటూ వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో నారాయణ స్వామి మద్యానికి బానిసయ్యాడు. మద్యం కొనుగోలుకు డబ్బు కోసం తరచూ వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న శివ.. బుధవారం ఉదయం పొలానికి వెళ్లి ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రమవుతున్నా ఇంటికి కుమారుడు రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే విగతజీవిగా మారిన శివను గమనించి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జలచౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

- పీఏబీఆర్ ఈఈ శ్రీనివాసులు

ఉరవకొండ: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో కేవలం 2.2 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండడంతో నాన్ ఆయకట్టులో పంటల సాగుకు నీటిని దొంగలిస్తే సంబంధిత రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని పీఏబీఆర్ ఈఈ శ్రీనివాసులు హెచ్చరించారు. పీఏబీఆర్, హెచ్చెల్సీ ఆయకట్టుకు నీటి విడుదలపై ఆయా శాఖల అధికారులతో బుధవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరిప్రసాద్‌తో కలసి ఆయన సమీక్షించారు. ఏటా రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉండేదని, డిసెంబర్ నాటికి కనీసం 3.5 టీఎంసీల నీరు ఉండేదని గుర్తు చేశారు. ఈ ఏడాది రిజర్వాయర్ ఎగువన వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నీరు తక్కువగా చేరిందన్నారు. దీంతో హెచ్చెల్సీ ద్వారా అందిస్తున్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని టీబీ డ్యాం ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. దీంతో పీఏబీఆర్‌లో ఉన్న 2.2 టీఎంసీల నీటిని జిల్లాలోని అన్ని ప్రాంతాల తాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జల చౌర్యానికి పాల్పడకుండా పోలీసు, రెవెన్యూ అధికారులతో కలసి కాలువ వెంబడి గస్తీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏబీఆర్ డీఈ విశ్వనాథరెడ్డి హెచ్చెల్సీ ఏఈ శాస్త్రి పాల్గొన్నారు.

19న 'స్పందన' పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: గత ఏడాదికి సంబంధించి స్పందన ఆత్మీయ సాహితీ పురస్కారాల ప్రదానం నవంబర్ 19న ఉంటుందని అనంత కవుల వేదిక అధ్యక్షుడు తూముచెర్ల రాజారాం, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022 సంవత్సరానికి సంబంధించి పురస్కారం ప్రముఖ సామాజిక ఉద్యమకారుడైన హైదరాబాదు నివాసి, కవి కృపాకర్ మాదిగ రాసిన 'పంచుకుందాం రా!' బహుజన మహాకావ్యానికి లభించిందన్నారు. 'స్పందన' అనంత కవుల వేదిక ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచిన సందర్భంగా స్పందన ద్విదశాబ్ది ప్రత్యేక పురస్కారాలను మరో నలుగురికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విభాగం కింద 'మా నాయిన పాట' కవితా సంపుటి రాసిన కాకినాడకు చెందిన కవి సుంకర గోపాలయ్య, 'కల్లం చుల బువ్వ' దీర్ఘ కవిత రాసిన కళ్యాణదుర్గం కవి రాఘవేంద్ర, 'మొలగొలుకు చేను' కవితా సంపుటి రాసిన నెల్లూరుకు చెందిన కవి పేరిశెట్ల శివకుమార్, 'పూల నిప్పులు' కవితా సంపుటి రాసిన ఆదోనికి చెందిన కవయిత్రి స్వయంప్రభను ఎంపిక చేసినట్లు వివరించారు.

ఉపకార వేతనాల వివరాలు అప్‌లోడ్ చేయండి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల కోసం నమోదు చేసుకున్న మైనార్టీ విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు వెంటనే పంపాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, తదితర వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న 7,006 మంది స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోగా, వీరిలో ఇప్పటి వరకూ 6,766 మంది వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను ఈ నెల 27వ తేదీలోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపితేనే విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు వీలైనంత తొందరగా విద్యార్థుల వివరాలను నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలన్నారు.

యువకుడి హత్య



హతుడు నారాయణస్వామి

నార్పల: మద్యం మత్తులో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని ఎస్సీ కాలనీకి చెందిన సిద్ధవటం నారాయణస్వామి (32) మంగళవారం రాత్రి తన ఐదుగురు స్నేహితులతో కలసి ఊరి బయట మామిడి తోటలో విందు ఏర్పాటు చేసుకున్నాడు. వీరిలో ముగ్గురు మద్యం సేవించి, విందు ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. అతిగా మద్యం సేవించిన నారాయణస్వామి, మరో ఇద్దరు అక్కడే ఉండిపోయారు. ఆ సమయంలో స్నేహితుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. అక్కడే ఉన్న బండరాళ్లతో నారాయణస్వామి తలపై బాది, గొంతు నులిమి హతమార్చారు. బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగు చూసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో జరిగిందా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, హతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



శాంతరాజ్

శెట్టూరు: మండలంలోని అయ్యగార్లపల్లికి చెందిన బొమ్మలాట కుమార్ కుమారుడు శాంతరాజ్ కనిపించడం లేదు. ఈ మేరకు తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు. శెట్టూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శాంతరాజ్ మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. బంధువుల ఇళ్లలో, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ తెలిసిన వారు 63622 17845కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

క్లుప్తంగా

జాబ్‌రోల్స్, కంప్యూటర్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో యాంబర్ ప్రాజెక్టు కింద జాబ్‌రోల్స్ అంశంపై 55 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ మేనేజర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ రోల్స్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై కూడా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93981 54460, 75696 59964 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చల్లగా చూడు గౌరమ్మా



గౌరమ్మ ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో గౌరమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. బంకమట్టితో తయారు చేసిన గౌరమ్మ ప్రతిమకు ఈనెల 23న శివాలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు బుధవారం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరమ్మ ప్రతిమను ఊరేగించారు. అనంతరం చెరువులో గౌరమ్మ ప్రతిమను నిమజ్జనం చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27 తేదీన ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

‘బైపాస్’లోనే వెళ్తాం..

- ఆత్మకూరులోకి రాని ఆర్టీసీ బస్సులు



ఆత్మకూరులోకి రాకుండా నేరుగా బైపాస్‌లో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు: అధికారులు ఎన్నిసార్లు చెప్పినా డ్రైవర్లు మాత్రం పద్ధతి మార్చుకోవడం లేదు. నూతనంగా బైపాస్ ఏర్పాటైనప్పటి నుంచి కొన్ని ఆర్టీసీ బస్సులు ఆత్మకూరులోకి రాకుండా నేరుగా బైపాస్‌లోనే వెళ్తున్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులు ఉదయం 8 గంటల వరకూ చాలా వరకూ ఆత్మకూరులోకి రావడం లేదు. అలాగే రాత్రి 8 గంటలు దాటితే చాలు ఏ ఒక్క బస్సు కూడా ఆత్మకూరులోకి రాకుండా నేరుగా బైపాస్‌లోనే వెళ్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్సులు ఆత్మకూరులో ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గరుడ వాహనంపై చింతల రాయుడు



గరుడ వాహనంపై విహరిస్తున్న చింతలరాయుడు

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవం సాగుతున్నాయి. నాల్గవ రోజు బుధవారం అశేష భక్తజనసందోహం జయజయ ధ్వానాల మధ్య గరుడ వాహనంపై చింతల రాయుడు పురవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి మోహినీ అలంకారంలో కొలువుదీరి భక్తులతో పూజలందుకున్నాడు. గరుడ వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించడం వలన సర్పదోష శాంతి, దివ్యమైన జ్ఞానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. స్వామి ఊరేగింపు పట్టణంలోని మెయిన్‌బజార్ మీదుగా సాగి తిరిగి పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్‌కు చేరుకుంది. భక్తులు వీధుల్లో కళ్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేసి స్వామికి ఘన స్వాగతం పలికారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: చుక్కలూరు రోడ్డులో పెన్నానది బ్రిడ్జి కింద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు సాయికుమార్, షావలి, గుర్రప్పను అరెస్ట్ చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.





రాప్తాడు నియోజకవర్గం పూలకుంట గ్రామ పొలాల్లో ట్రాక్టర్‌లో వేరుశనగ కట్టెని తరలిస్తున్న దృశ్యం, పొలంలో కాయలను ఏరుతున్న మహిళలు

కాయాకష్టం

ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట చేతికి వచ్చిందనుకుంటే.. పంట తొలగింపులో మరో ఇబ్బంది రైతులను వెంటాడుతోంది. రాప్తాడు మండలం పూలకుంట సమీపంలో రైతులు వేరుశనగ పంట తొలగింపులో తలమునకలయ్యారు. అయితే భూమిలో తేమ శాతం లేకపోవడంతో చెట్టును తొలగించినప్పుడు అత్యధికంగా కాయలు భూమిలోనే ఉండిపోయాయి. దీంతో రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుని, భూమిలో ఉండిపోయిన కాయలను వెలికి తీయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:





పొలంలో రాలిపోయిన వేరుశనగ కాయల కోసం భూమిని తవ్వుతున్న దృశ్యం



సేకరించిన కాయలను చూపుతున్న మహిళ

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దేవదాయ శాఖ ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వై.సి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. అర్చకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం దేవదాయ, ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల పరిధిలో భూములు ఉన్నప్పటికీ సాగుకు నోచుకోని పరిస్థితుల్లో పూజారులు అవస్థలు వర్ణనాతీతమన్నారు. పంటలు పండక ఇబ్బందులు పడుతున్న అర్చకులకు దేవాదాయ శాఖ ద్వారా దేవాలయ నిర్వహణకు కొంత సాయం అందించాలన్నారు. 10 ఎకరాల్లోపు భూములు ఉన్న వారికి డీడీఎన్ఎస్ వర్తింపజేయాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో 13వ కాలంలో అర్చకుల పేర్లు చేర్చాలని కోరారు. డెత్ గ్రాట్యుటీ ఇవ్వడంలో అలసత్వం జరుగుతోందన్నారు. భూములు సాగు చేసుకుంటున్న అర్చకులకు కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు. రైతులకు వచ్చే సబ్సిడీ పథకాలన్నీ అర్చకులకు వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలకు జిల్లా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు 3 రోజుల ముందుగానే సమాచారం తెలియజేయాలన్నారు. అర్చకులు పెట్టుకున్న అర్జీలకు జిల్లా దేవదాయ శాఖ అధికారులు, కమిషనర్, ఈఓలు తగిన సమాధానం సకాలంలో ఇచ్చి అర్చకుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ సలహాదారు శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు

29న జిల్లా సమగ్రాభివృద్ధిపై సెమినార్

అనంతపురం అర్బన్: సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29న జిల్లా సమగ్రాభివృద్ధిపై సెమినార్ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెమినార్‌కు సంబంధించి బ్రోచర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపోవనం నారాయణపురం రోడ్డులోని రెడియంట్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందన్నారు. సెమినార్‌లో నిష్ణాతులైన ప్రముఖులు పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడతారన్నారు. సెమినార్‌ను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రారంభిస్తారన్నారు. హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పురేంద్రప్రాద్ కీలక ఉపన్యాసం ఇస్తారన్నారు. అదే విధంగా పలువురు నిపుణులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర కుమార్, నాగమణి పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

ఘనంగా జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు: దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. చింతంబరస్వామి గుడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు పాతసంతమార్కెట్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగింది. నేత కార్మికులు అమ్మవారి జ్యోతులను గ్రామపురవీధుల్లో తప్పెట్ల, మేళాలతో నడుమ భక్తిగీతాలను ఆలపిస్తూ ఊరేగించారు. వేడుకను తిలకించడానికి పరిసర గ్రామాలైన షేక్‌పల్లి, ధర్మాపురం, చాగల్లు, గార్లదిన్నె, చిన్నపప్పూరు, చింతరపల్లి, నరసాపురం తదితరగ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏటా దసరా సందర్భంగా అమ్మవారి జ్యోతుల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శరత్‌చంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు.



పురవీధుల్లో జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

యాడికి: మండల కేంద్రంలో బుధవారం జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున తొగటవీర క్షత్రియులు మార్కండేయ స్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన జ్యోతులను నెత్తిన పెట్టుకుని యాడికి పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

గుంతకల్లుటౌన్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా భారతీయ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 9 ప్రాంతాల్లో కొలువుదీర్చిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక రైల్వేగ్రౌండ్ నుంచి మొదలైన శోభాయాత్ర మెయిన్‌రోడ్డు, బీరప్పసర్కిల్ మీదుగా వినాయక ఘాట్ వరకు కొనసాగింది. అనంతరం దుర్గాదేవి విగ్రహాలను వినాయకఘాట్‌లో నిమజ్జనం చేశారు. ఈ ర్యాలీలో మహిళల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సమితి అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, ఉపాధ్యక్షులు వసుంధర, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఆ నలుగురు సేవా సమితి సభ్యులు రవీంద్ర, శ్రీధర్‌రెడ్డి, కేశవ తదితరులు పాల్గొన్నారు.



దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉరవకొండ: స్థానిక జైనబ్బీ దర్గా మసీదు వద్ద నివాసముంటున్న సులేమాన్ (19) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి అనంతపురంలోని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 19న హుసేనీ కుమారుడు సులేమాన్ నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పైకప్పుపై ఉన్న ఇనుప కడ్డీలను తీసుకొస్తుండగా అటుగా ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. తీవ్రంగా గాయపడిన అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అ‘పూర్వ’ సాయం

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997–98 విద్యాసంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు బుధవారం తోటి స్నేహితుడి ఉన్నత విద్యాభ్యాసం కోసం రూ.41 వేలు ఆర్థికసాయం అందించారు. చిప్పలమడుగు గ్రామానికి చెందిన షామీర్‌బాషా కుమార్తె సదాఫికి జేఎన్‌టీయూ అనంతపురంలో ఎంబీఏలో సీటు వచ్చింది. పేదరికంతో ఇబ్బంది పడుతున్న షామీర్‌బాషకు ఫీజు కట్టడం ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న షామీర్ బాషా స్నేహితులు తామున్నామని అండగా నిలిచారు. పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన వడ్డీ వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య మూలింటి లక్ష్మికి బుధవారం ఉదయం సర్పంచ్ ఆదినారాయణమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ కే.వి.తనూజా, పంచాయతీ కార్యదర్శి నవీన్ తదితరులు రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18–70 ఏళ్ల లోపు ఉన్న వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదంలో మృతి చెందితే రూ.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలత, సచివాలయ కన్వీనర్లు కొండా రెడ్డి, గుర్నాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన తలారి మధుసూధన్ (27) అనారోగ్యంతో బుధవారం మరణించాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు అతిక్‌రెడ్డి తదితరులు కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.



రూ.10 వేల నగదు అందజేస్తున్న దృశ్యం

నేటి నుంచి మాబుసుబహానీ ఉరుసు

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీనివాస్ నగర్‌లో ‘షాహేగౌసే ఆజం ఆసార్’ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి పది రోజుల పాటు మాబూసుబహానీ (దస్తగిరి స్వామి) గ్యార్మీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు దస్తగిరి స్వామి జీవిత విశేషాలు, మహిమలను వివరించడం జరుగుతుందన్నారు. గురువారం రాత్రి 8:30 గంటలకు స్వామి వారి గంధాన్ని పురవీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు. అలాగే తెహ రీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా, మొహమ్మద్ ఖుష్ హాల్ అహ్మద్ అమ్ జది ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం, దువా కార్యక్రమం ఉంటుందన్నారు. 27వ తేదీ ఉరుసు జరుగుతుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం దస్తగిరి స్వామి పవిత్ర కేశాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచుతారన్నారు. ఈ ఉరుసు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కర్నూలుకు చెందిన హజరత్ సయ్యద్ ఖమర్ పీర్ ఖాదిరి తనయులైన ‘హజరత్ సయ్యద్ సందాని పాషా ఖాదిరి’ సాహెబ్, సయ్యద్ షా ముహమ్మద్ వజ్యూద్దిన్ ఖాదిరి, గుంటూరు నుంచి హజరత్ షాహిద్ రాజ హాజరవుతారన్నారు. గుసుల్ ప్రత్యేక దువా కార్యక్రమం ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ఉరుసులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



అలంకరణలో మాబుసుబహానీ దర్గా

హోటళ్లపై విజిలెన్స్ అధికారుల దాడి

అనంతపురం క్రైం: కాలం చెల్లిన ఆహారం, అపరిశుభ్రత, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంతో పాటు కలుషిత వాతావరణం ఇది అనంతలో హోటళ్ల బాగోతం. బుధవారం అధికారుల బృందాల తనిఖీల్లో హోటళ్ల నిర్వాహకుల మోసాలు వెలుగుచూశాయి. హోటళ్లు, రెస్టారెంట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు సాయి ప్రసాద్, వెంకటరమణ, రామారావు, ఎస్ఐ శేషగిరి, వాసు ప్రకాష్, రవీంద్రనాథ్, డీసీటీఓ విజయలక్ష్మి, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఐదు హోటళ్లను తనిఖీ చేశారు. తనిఖీ చేసిన హోటళ్ల జాబితాలో ప్రియదర్శిని హోటల్, బాషా హోటల్, గోల్డెన్ తాజ్ హోటల్, మదీనా తందూరి చికెన్ సెంటర్, మయూరి ఫ్యామిలీ రెస్టారెంట్లున్నాయి. హోటల్లో అపరిశుభ్రమైన వాతావరణం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఫ్రిడ్జ్‌లో పెట్టిన కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు ఈ కేసులను అప్పగిస్తామన్నారు. దాడులు ఇంకా కొనసాగుతున్నాయి.



ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

‘ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు’

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్లు అటెండెన్స్ 9 గంటల ముందే వేసి, పిల్లల హాజరు ఉదయం 9:30 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలి. అలాగే 9 గంటల్లోపు సెలవు దరఖాస్తు చేయాలంటూ రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు పేరిట ఐటీ సెల్ విభాగం టీచర్లపై ఒత్తిడి చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు పేర్కొన్నారు. బుధవారం ‘ఆప్టా’ జిల్లా గౌరవాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మెసేజ్ ఐటీ విభాగం పేరుతో వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోందన్నారు. 2022 ఆగస్టు 21న కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 10 నిముషాలు గ్రేస్ పీరియడ్‌ని టీచర్లకు అమలు చేయాలన్నారు. ఉదయం 9:15 గంటలకు ప్రార్థన ముగుస్తుందని, 9:30 గంటల్లోపు విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో ఎలా సబ్‌మిట్ చేయాలని ప్రశ్నించారు. పాత పద్ధతిలో 10:30 గంటల సమయాన్ని పొడిగించాలని కోరారు. 500 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో 15 నిముషాల్లోపు విద్యార్థుల అటెండెన్స్‌ను ఆన్‌లైన్ చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ విషయంలో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తగు ఆదేశాలు జారీ చేసి టీచర్లలో ఏర్పడిన మానసిక ఒత్తిడి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో రిజర్వేషన్ సదుపాయం



ఖోఖోలో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: క్రీడల్లో బాగా రాణించి సర్టిఫికెట్లు పొందితే స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ తెలిపారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 28 ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. క్యాంప్‌లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. బుధవారం క్యాడెట్లకు ఖోఖో, కబడ్డీతో పాటు ఇతర క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఎస్ఎం కేకే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘బస్సు యాత్ర’ జయప్రదం చేయండి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మేలును తెలియజేయడానికి పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రను జయప్రదం చేయాలని మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి, మైనార్టీ జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆ మహానేత కుమారుడు ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. డిప్యూటీ సీఎం, మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు కేటాయించారని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి రూ.23 వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. బుక్కరాయసముద్రంలో గురువారం జరిగే బస్సుయాత్రకు పెద్ద ఎత్తున మైనార్టీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై నుంచి పడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగప్రకాష్, టోనీ బ్లెయిర్ పని నిమిత్తం బైక్‌పై బళ్లారికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి ప్యాపిలికి వెళ్తుండగా కొజ్జేపల్లి శివారులో బైక్ అదుపు తప్పి బొల్తా కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన అనిత బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకి వెళితే.. గత కొన్ని రోజులుగా అనిత కుటుంబ సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనగానదొడ్డిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: అనగానదొడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాము గత కొన్ని నెలలుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపం చెందిన అతడు ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రామును కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేపచెర్లలో వైద్య శిబిరం

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేపచెర్ల, వేపచెర్ల ఎగువ తండా, వేపచెర్ల దిగువ తండా గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శనగ పంటలో మెలకువలు పాటించాలి

కళ్యాణదుర్గం: రబీలో సాగు చేసే పప్పుశనగ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శిరీష చెప్పారు. శనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకేలో బుధవారం రైతులకు వివరించారు. ఒకే పొలంలో పంటను సాగు చేయడం వల్ల ఎండు తెగలు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పప్పుశనగ విత్తుకునే రైతులు ముందురోజు రాత్రి కిలో విత్తనానికి 2.5 గ్రాముల కర్బండిజంతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం మరుసటి రోజు 10 గ్రాముల ట్రికోడెర్మా విరిడీతో విత్తన శుద్ధి చేసి విత్తుకుంటే పంటను ఎండుతెగల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పంటను విత్తిన 12–15 రోజుల లోపే 10 గ్రాముల కార్బెండిజం తో పాటు 60 శాతం మాంకోజెడ్ లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలన్నారు. జొన్న లేదా ధాన్యపు పంటను పంటలతో కనీసం మూడేళ్లు పంట మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త తెలియజేశారు.